ప్రజాశక్తి
శుక్రవారం 22 ఆగస్టు 2025
5
శ్రీ సత్యసాయి

పక్కా కమర్షియల్

పేరుకే అగ్రికల్చర్.. వ్యాపారం అంతా కమర్షియల్.. లేఅవుట్ల పేరుతో కొత్త కల్చర్..! ఇది చిలమత్తూరు సమీపంలో ఇటీవల సాగుతున్న రియల్ ఎస్టేట్ దందా. పైకి అంతా సాధారణంగా కన్పిస్తున్నా రియల్టర్లు చట్టంలో ఉన్న లొసుగులను వారికి అనుకూలంగా మార్చుకుని వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చి యథేచ్ఛగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. చూసే వారికి ఇదంతా చట్టబద్ధంగా అనేలా చిత్రీకరించి అమ్మకాలు సాగించేస్తున్నారు. చట్టంలో కొన్ని లొసగులను వారికి అనుకూలంగా మార్చుకుని వారు చేస్తున్న దందాకి చాలా మంది బలైపోవడమే కాకుండా ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడుతోంది. వీటిని నియంత్రించాల్సిన అహుడా పట్టించు కోకుండా నిద్రమత్తులో జోగుతూ ఉండడం గమనార్హం.

చిలమత్తూరు మండలంలో వెలసిన కొడికొండ హిల్స్

ప్రజాశక్తి-చిలమత్తూరు

శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కొడికొండలో ఇటీవల కొండకొండ హిల్స్ లే అవుట్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 90 ఎకరాల్లో రియల్టర్లు దీన్ని తీర్చిదిద్దారు. అందులో ఫాం హౌస్ నిర్మాణం చేసుకోవచ్చు.. సొంతంగా వ్యవసాయం చేసుకోవచ్చు అంటూ ప్రకటనలు ఇస్తున్నారు. వారి ప్లాట్ చుట్టూ కంపౌండ్ కూడా నిర్మించుకునే వెసులుబాటు ఉంటుంది. ఈ వెంచర్ అంతా బయటకు వ్యవసాయ భూమిలా కన్పిస్తున్నా లోపల మాత్రం కమర్షియల్‌గా అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో చదరం అడుగు ప్రకారం ధర ఉంటుంది. కొనే వారికి చదరం అడుగుల్లో అమ్మకాలు చేసినా రిజిస్ట్రేషన్ మాత్రం సెంట్లలో ఉంటుంది. అమ్మకం కూడా చట్టానికి అనుకూలంగా వ్యవసాయ భూమి అనుకోవాలని 0.15 నుంచి 0.25 సెంట్లలో అమ్ముతారు.


AP Land Tools

Adangal Report

జిల్లా: Sri Sathya Sai - శ్రీ సత్యసాయి					మండలం: CHILAMATHUR - చిలమత్తూరు			గ్రామం: KODIKONDA - కొడికొండ				Survey No:: 183-4			
క్రమ సంఖ్య	సర్వే నెం	పూర్తి విస్తీర్ణం	సాగుకు పనికి రాని విస్తీర్ణం	సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం	భూమి స్వభావం	శిస్తు (రూ.)	భూమి వివరణ	జల ధారము	ఆయకట్టు విస్తీర్ణం	ఖాతా నెంబరు	పట్టాదారు పేరు (తండ్రి/ భర్త పేరు)	అనుభవదారుని పేరు (తండ్రి/భర్త పేరు)	అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు)	అనుభవ స్వభావం	రిమార్కులు
1	183-4	0.7400	0.0000	0.7400	Village Service Inam made FreeHold in 2023	0.33	మెట్ట	గొ.బావులు	0.0000	123456	UNSETTLED PROPERTY (UNSETTLED PROPERTY)	UNSETTLED PROPERTY (UNSETTLED PROPERTY)	0.7400	Village Service Inam made FreeHold in 2023	

ప్రస్తుతం మంగళ ఇనాంగా ఉన్న 1బి

ప్రభుత్వ భూమిని కలుపుకోవడమే..

కొడికొండలో దాదాపు 90 ఎకరాల్లో వెలసిన కొడికొండ హిల్స్‌లో ప్రభుత్వ ఇనాం భూములు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇటీవల గ్రామస్థులు ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు సర్వే చేసి నిజమేనని నిగ్గు తేల్చారు. కానీ ఆ లేఅవుట్‌పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ లేవు. సర్వే నెంబర్ 183-4లో మంగళ ఇనాం 0.74 సెంట్లు ఆక్రమణలో ఉంది. ఇదంతా రికార్డుల పరంగా తెలుస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు వేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పంచాయతీ అనుమతి ఉందా..?

వ్యవసాయమే కాకుండా ఫామ్ హౌస్‌ల నిర్మాణం చేస్తున్న ఈ లేఅవుట్‌కి విద్యుత్ కనెక్షన్ కోసం పంచాయతీ అనుమతి తప్పనిసరి. అనుమతి ఉంటేనే డొమెస్టిక్ పర్పస్ విద్యుత్ సరఫరా చేస్తారు. ఈ లేఅవుట్‌కు మాత్రం ఇప్పటికే విద్యుత్ కనెక్షన్ ఉంది. బిల్డింగ్ అప్రూవల్ ఉందా లేదా అని పంచాయతీ అధికారులని అడగ్గా వారు ఇది అహుడా పరిధిలోకి వస్తుందని చెబుతున్నారు. అహూడా కూడా లేఅవుట్‌కు అనుమతిచ్చిన దాఖలాలు లేవు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్ వేసినా అహూడా ఏం చేస్తుందనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఇకనైనా అహూడా ఇలాంటి వాటిపై దృష్టి పెట్టి చట్టబద్ధం కాని అనధికార అగ్రికల్చర్ లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- ◆ పేరుకు మాత్రమే అగ్రికల్చర్
- ◆ వ్యాపారం అంతా కమర్షియల్
- ◆ అగ్రికల్చర్ వెంచర్, లేఅవుట్ల పేరుతో కొత్త కల్చర్
- ◆ ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- ◆ నిద్రమత్తులో అహూడా

కనీస స్పందన లేని అహూడా

చిలమత్తూరు మండలంలో అగ్రికల్చర్ లే అవుట్ అనేది పెద్ద కల్చర్‌గా మారింది. దీనికి సంబంధించి అహూడా అనుమతులు తీసుకోకుండా, ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొడుతూ, వ్యవసాయేతర భూమిగా మార్చే పని లేకుండా ప్లాట్లు విక్రయిస్తూ బడా రియల్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఇక కమర్షియల్ భూమి అయితే రిజిస్ట్రేషన్ ఛార్జీలు అధికం అవుతాయి. వీటన్నింటినీ తప్పించుకుంటూ అటు ప్రభుత్వ, ఇటు అన్ని వ్యవస్థల ఆదాయానికి గండి కొడుతున్నారు. పక్కా కమర్షియల్‌గా వ్యాపారం జరుగుతున్నా సంబంధిత అనంతపురం, హిందూపూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) దీనిని పట్టించుకోకపోవడం గమనార్హం. అహూడా నిద్రావస్థలో ఉండడంతోనే చిలమత్తూరు మండలంలో అగ్రిలేఅవుట్‌లు అక్రమంగా వెలిసి వందల ఎకరాల్లో కమర్షియల్ బిజినెస్ చేస్తున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బాగేపల్లి సమీపంలోని సమరాస్ హోటల్ వద్ద ఏర్పాటుచేసిన బోర్డ్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఉచిత శిక్షణ పొంది యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ టిఎస్.చేతన్ పిలుపునిచ్చారు. గురువారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్ నందు కేంద్ర గ్రామీణ మంత్రిత్వ శాఖ సహకారంతో కెనరా బ్యాంక్ సౌజన్యంతో నిరుద్యోగ యువతకు ఇచ్చే శిక్షణపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతకు తమకు ఇష్టమైన రంగాల్లో ఉచిత శిక్షణ పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. గ్రామీణ యువతకు ఉచిత శిక్షణకు కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బైక్ మెకానిజం, డ్రోన్ ఆపరేటింగ్, తదితర సాంకేతికతపైనా శిక్షణ ఉంటుందన్నారు. పురుషులకు టూ వీలర్, మోటార్ సైకిల్ సర్వీసింగ్, మొబైల్ రిపేర్, ఫోటోగ్రఫీ, ఎలక్ట్రికల్, హోమ్ వైరింగ్, ప్లంబింగ్, మోటార్ల రిపేర్, సీసీ కెమెరా తదితర రంగాల్లో శిక్షణ పొందడానికి ఇంటర్, డిగ్రీ పాస్ అయిన వారు అర్హులు అన్నారు. మహిళలకు టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్, జ్యూట్ బ్యాగ్ తయారీ, అగరబత్తి, కొవ్వొత్తుల తయారీ, కంప్యూటర్, అకౌంటింగ్, పచ్చళ్లు, బేకరీ ఉత్పత్తులు తయారీ వాటిల్లో శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలు 12 నుంచి 31 రోజుల వరకు ఉంటుందన్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందినవారు 19 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి, కనీసం 10 తరగతి పాసైన మహిళా అభ్యర్థులు తగిన విద్యా అర్హతలు, ఆధార్, రేషన్ కార్డులతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం.రమణ కుమార్, సిబిఆర్‌ఎస్ ఈటిఐ డైరెక్టర్ శాంతి ప్రియ, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, కెనరా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య అభివృద్ధి పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే నైపుణ్య పోటీలకు జిల్లాలోని యువతి, యువకులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్ఎస్ ఈటిఐ శిక్షణ సంబంధించిన కలెక్టర్ గోడపత్రికను ఆవిష్కరించారు. జిల్లాలోని 18 ఏళ్ల నుంచి 25 సంవత్సరాల యువతీ యువకులు నైపుణ్య పోటీలలో పాల్గొని తమ ప్రతిభ చూపాలన్నారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి బంధ హరికృష్ణ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఎంపిక అయిన వారు రాష్ట్రస్థాయికి, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయికి, అక్కడి నుంచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. కార్పెంటర్, ఎలక్ట్రికల్, పెయింటింగ్, డెకరేషన్, కుకింగ్, సైబర్ సెక్యూరిటీ, జ్యువెల్లరీ, వెబ్ టెక్నాలజీ, బేకరీ, బ్యూటీ థెరపిస్ట్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ తదితర వాటిలో ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇందులో పదవ తరగతి, ఐటిఐ, పాలిటెక్నిక్, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ ఇతర డిప్లమా కోర్సులు చదువుతున్న వారు వెబ్ సైట్ లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9988853335కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి, నాబార్డ్ డీడీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జ్వాలాపురంలో విగ్రహ ప్రతిష్టాపన

బత్తలపల్లి : మండలంలోని జ్వాలాపురం ఎస్సీ కాలనీలో దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం పెద్దమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాని నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంతరం గ్రామంలో విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో నిర్వహకులు లక్ష్మీనారాయణతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

మడకశిర టౌన్ : అర్హులకు మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు గురువారం పంపిణీ చేశారు. మడకశిరలోని తన క్యాంపు కార్యాలయంలో 31మంది లబ్ధిదారులకు రూ.11,75,139 విలువ చేసే చెక్కులను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుదాం

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి జిల్లా జగరాజుపల్లి సమీపంలో గల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ ఖాదర్ ఆధ్వర్యంలో పర్యావరణం పై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పర్యావరణ వేత్త భాస్కర్ నాయుడు మాట్లాడుతూ సహజ వనరుల నష్టాన్ని నివారించి కాపాడుకోవాలని కోరారు. అనంతరం ప్రాణాయామం వల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ప్రకృతిని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో ట్రాన్స్‌పోర్టు యూనియన్ జిల్లా కార్యదర్శిగా పెడబల్లి బాబా

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా ఆటో ట్రాన్స్ పోర్ట్ యూనియన్ సిఐటియు మూడవ మహాసభలు గురువారం పుట్టపర్తి లో ని సిపిఎం కార్మిక కర్షిక భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పదిమంది సభ్యులను ఎన్నుకొన్నారు. వీరిలో సిఐటియు జిల్లా ఆటో ట్రాన్స్‌పోర్టు యూనియన్ జిల్లా కార్యదర్శిగా పెడబల్లి బాబా ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి పెడబల్లి బాబా మాట్లాడుతూ చలానాల రూపంలో ఆటోరంగం నుంచి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు దోచుకుంటుందనీ, ప్రయివేటు ఫైనాన్స్ వేసే అధిక దోపిడీలకు ఆటో డ్రైవర్లు బలవుతున్నారని అన్నారు. వీటిపై ఆటో కార్మికులు అందరూ కలిసి రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తుపెద్ద ఎత్తున పోరాటలు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ ,ఉపాధ్యక్షుడు జి ఎల్ నరసింహులు, సిఐటియు మున్సిపల్ రంగం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, జడ్పీ శ్రీనివాసులు, కుళ్లాయప్ప, పైపల్లి గంగాధర, సాకే వెంకటేష్, రఫీ, రామకృష్ణ, సుధాకర్, నూర్ మొహమ్మద్, రామాంజి, అత్తర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

పెడబల్లి బాబా

భూ సేకరణ చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి - గోరంట్ల

2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని ఎపిరైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జంగాలపల్లి పెద్దన్న, హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం మండలంలోని రెడ్డిచెరువుపల్లిలో గ్రామ రైతులతో ముఖాముఖి చర్చించారు ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను నాయకులకు చెప్పారు. ఏపీ ఐసీసీ పేరుతో ప్రభుత్వం రైతులకు సమాచారం ఇవ్వకుండా చెప్పకుండా సర్వే చేస్తున్నారన్నారు. పరిశ్రమల పేరుతో తమ భూములు లాక్కుంటున్నారని వాపోయారు. బలవంతంగా భూ సేకరణ చేస్తే వలసలు వెళ్లాల్సి వస్తుందన్నారు ఇప్పుడు తమ భూముల్లో సర్వే ఎందుకు చేస్తున్నారో కూడా తెలియడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న, హరి, ప్రవీణ్ మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు గ్రామాల్లో రైతులకు కూడా తెలియకుండా ప్రభుత్వం భూసేకరణ చేయడం అన్యాయమన్నారు. రైతులు భూములు కోల్పోతే వ్యవసాయం చేయడానికి భూమి లేక రైతులు వలస బాట పట్టాల్సి వస్తుందన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

కరువు సీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి, తదితరులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

కరువు సీమను హంద్రీనీవా ద్వారా సస్యశ్యామలం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధ్యేయమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర్ణ, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలోని హంద్రీనీవా కాలువ ద్వారా ప్రవహించే కృష్ణా జలాలకు గురువారం గంగ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరువు ప్రాంతమైన రాయలసీమకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష అన్నారు. కృష్ణా జలాలతో అన్ని చెరువులను నింపుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా నీరు రావడం వల్ల రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. బుక్కపట్నం చెరువు కింద నీటి ముంపునకు గురై నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. రైతుల విన్నపం మేరకు హంద్రీనీవా కాలువపై కొన్నిచోట్ల బ్రిడ్జి నిర్మాణాలు, చెరువులకు నీరు వదిలే ప్రాంతాల్లో స్లూయిజ్ గేట్లను ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ జిల్లా ఎస్ఇ రాజా స్వరూప్, హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఎస్ఈ వెంకటేశ్వర శెట్టి, కొత్తచెరువు మార్కెట్ యార్డ్ చైర్మన్ శివప్రసాద్ , టిడిపి నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు , పార్టీ జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ కొత్తచెరువు మండల టిడిపి కన్వీనర్లు రామకష్ణ ఒలిపి శ్రీనివాసులు , మాజీ సర్పంచ్ చంద్రశేఖర , సింగిల్ విండో అధ్యక్షులు ముమ్మినేని వెంకట్ రాముడు , బుక్కపట్నం సింగిల్ విండో అధ్యక్షులు చెన్నకృష్ణ ,మారాలా సింగిల్ విండో అధ్యక్షులు అప్ప స్వామి నాయుడు, గూనిపల్లి అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి , పుట్టపర్తి మండలం పెడబల్లి సింగల్ విందు అధ్యక్షుడు విజయ్ కుమార్ , పట్టణ టిడిపి కన్వీనర్ బోయ రామాంజనేయులు టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కు అవగాహన సదస్సును పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మడకశిర మండల ఏపీఎం నాగమణి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం సంజీవరాజు మాట్లాడుతూ ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రాముఖ్యత, ప్రభుత్వ అందిస్తున్న పథకాల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మండల సమాఖ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి అంటే ఇదేనా..?

వికలాంగుల పింఛన్ల రద్దు కుట్రపై ప్రజా సంఘాల ఆగ్రహం

రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ఇంట్లో ఉన్న అందరికీ పింఛన్ అన్నారు.. అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగుల పింఛను రద్దు చేస్తున్నారు... ఆదర్శ రాష్ట్రం కోసం సంపద సృష్టించడం అంటే ఇదేదాన అని రాజకీయ పార్టీల ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వికలాంగుల పింఛను రద్దు చేయడానికి తీసుకుంటున్న చర్యలను వ్యతిరేకిస్తూ రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజకీయ ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ వికలాంగుల పింఛన్ల రీ సర్వే పేరిట అర్హత ఉన్న వాళ్ళందరికీ నోటీసులు జారీ చేశారన్నారు. నోటీసులు ఎందుకు జారీ చేశారో తెలియక లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారన్నారు వికలాంగుల విషయంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం న్యాయమా అంటూ ప్రశ్నించారు. అర్హత సర్టిఫికెట్ పై విచారణ పేరుతో అర్హత నిరుపించుకోవాలని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ లబ్ధిదారులు తిరగాల్సి వస్తోందన్నారు. రీ సర్వేను అడ్డం పెట్టుకొని రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వేల మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. హిందూపురం రూరల్ పరిధిలో 7606 మంది పింఛన్ దారులలో 767 మంది వికలాంగ పింఛనుదారులుండగా అందులో 147 మందికి నోటీసులిచ్చారన్నారు.బీసీలకు 50 సంవత్సరాలకే పింఛను ఇస్తామని చెప్పిన చంద్రబాబు హామీ ఎక్కడికెళ్ళిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వికలాంగుల పింఛను రద్దు చేసి వారికి ఇచ్చే డబ్బుతో సంపద సృష్టిస్తారా అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్యామ్ కిరణ్, ఆర్ఎస్పీ పార్టీ ఏ శ్రీనివాసులు, మాజీ ఐఎన్.టిసి నాయకులు అమానుల్లా, ఎంఐఎం మున్నా, ఎమ్.ఎస్.ఎఫ్ రవికుమార్, బిఎస్పీ హరికుమార్, సుబ్బరాయుడు, ఏపీ ఆర్.ఎస్.పి కోడుమూరు నౌషాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల నియామకంలో నిబంధనలు పాటించాలి

యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా సర్వ శిక్ష అభియాన్ పోస్టుల భర్తీ కోసం నియమ నిబంధనలను పాటించలేదని యుటిఎఫ్ నాయకులు విమర్శించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీలకు సంబందించిన 10 రకాల పోస్టుల కొరకు జిల్లాలో మొత్తం 120 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారనిఆ పోస్టుల నియామకం కోసం గురువారం జరుగుతున్న మౌఖిక పరీక్ష నందు అర్హత సాధించిన 34 మంది అభ్యర్థుల మార్కులను బహిర్గతం చేయకుండా ఇంటర్వ్యూలు నిర్వహించడం అనుమానంగా ఉందన్నారు. అధికారులు అక్రమ మార్గాలకు తావిచ్చినట్లే అవుతోందని విమర్శి:చారు. నిబంధనలు పాటించకుండా అభ్యర్థులకు వచ్చిన మార్కులను బహిర్గతం చేయకుండా ఇంటర్వ్యూలు నిర్వహించడం సరికాదన్నారు. ఈ ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థుల మార్కులు బహిర్గతం చేయకుంటే ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు దిగుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ,జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్,కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు, నారాయణ స్వామి, లక్ష్మి నారాయణ, రామకృష్ణ నాయక్, రామాంజినేయులు, నాయకులు జనార్ధన్, మధుసూదన్, రెడ్డి రాజేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాంతియుతంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకుందాం

ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి - కదిరి టౌన్

అందరి సహకారంతో వినాయక చవితి ఉత్సవాలను సజావుగా జరుపుకుందామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు . గురువారం కదిరి ఆర్డీవో కార్యాలయంలో పట్టణ ప్రజలు పుర ప్రముఖులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ ప్రతి ఏడాది ఎంతో వైభవంగా జరిగే వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకుందామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. వినాయక నిమజ్జనం సమయంలో ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. పోలీసులు అధికారులు సలహాలు సూచనలు పాటిస్తూ ఉత్సవ కమిటీ సభ్యులు చూడాలన్నారు. నిమజ్జనం రోజు సాయంత్రం ఐదు లోపు కోనేరు దగ్గరికి విగ్రహాలు చేరుకునేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్, ఆర్డీవో వివిఎస్ శర్మ , డిఎస్‌పి శివ నారాయణ స్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, సిఐలు నారాయణరెడ్డి నిరంజన్ రెడ్డి అన్ని శాఖల అధికారులు కూటమి నాయకులు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

పెనుకొండలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

నిరసల్లో పాల్గొన్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మా బున్నీసా, శ్రీదేవి , సిఐటియు నాయకులు జగన్మోహన్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ ఆర్ ఎస్ యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలపై గతంలో 42 రోజుల సమ్మె చేసిన సందర్భంగా అప్పటి ప్రభుత్వం మినీ అంగన్వాడీలను మెయిన్ గా మారుస్తామని చెప్పి జీవో విడుదల చేయలేదని విమర్శించారు. ఇప్పుడు అంగన్వాడీలకు ఎఫ్ఆర్ఎస్ యాప్ పెట్టి చాలా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు .యాప్ ను రద్దు చేయాలని అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అనంతరం కదిరి ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నిక జరిగింది అధ్యక్షులుగా ప్రమీలమ్మ, కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా ఎలిజబెత్ రాణిని ఎన్నుకొన్నారు.

చిలమత్తూరు : పాత మొబైల్ ఫోన్లలో కొత్త యాప్‌లు ఇన్‌స్టాల్ కాకపోవడం, తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల పనులు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంగన్వాడీలు వాపోయారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ ఎన్నికల ముందు యాప్‌లతో పనిలేకుండా చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పిందని విమర్శించారు. ఇప్పటికే ఉన్న యాప్‌లకు తోడు ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బాలసంజీవని 2.0 వర్షన్ కారణంగా పనిభారం మరింత పెరిగిందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ కోసం ఫొటో క్యాప్చర్ తప్పనిసరి చేయడం, ఒక్కో పనిని మూడు వేర్వేరు యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి రావడం తమకు భారమైందని పేర్కొన్నారు. పైగా ఫేస్‌యాప్‌లో హాజరు నమోదు చేసిన రోజులకు మాత్రమే వేతనం ఇవ్వడం మరింత అన్యాయమని కార్యకర్తలు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్, అంగన్వాడి ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి శోభారాణి, మండల నాయకులు పద్మావతి, రామ తులసి, సునీత, ఉషారాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ :అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి వారి డిమాండ్ల సాధనకోసం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనం పెంచాలన్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేసి గ్రాడ్యుటీని అమలు చేయాలన్నారు. ఈనెల 20న ఇచ్చిన జీవో ప్రకారం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చెయ్యాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను అంగన్వాడీలకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దన్న, వెంకటేష్, బాబ్జాన్, నౌషద్, ముత్తు, పోతలయ్య, అంగన్వాడీ నాయకులు పుష్పలత, నాగరత్న, శ్రీదేవి,రజియా తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలో గురువారం నాడు మండలం లోని అంగన్వాడీ సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మండల కేంద్రం లోని ప్రధాన కూడలి లో మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ సౌజన్య లక్ష్మి కి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ నాయకురాలు మాట్లాడుతూ అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివమ్మ, సంపూర్ణమ్మ, నేత్రవతితో పాటు మండలంలోని అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ : మినీ అంగన్వాడి సెంటర్లన్నీ మెయిన్ అంగనవాడీలుగా పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం పెనుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ముందు అంగన్వాడీలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి భావమ్మ మాట్లాడుతూ 1800 మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తించాలన్నారు. కొన్ని మినీ అంగన్వాడీలను మాత్రమే మెయిన్ అంగన్వాడీలుగా ప్రభుత్వం గుర్తించడం భావ్యం కాదన్నారు. అనంతరం సిడిపిఒ ధనలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాబున్నీసా, సెక్టార్ లీడర్లు సావిత్రి, శ్యామల, సరస్వతి, మీనా, సుజాత, సుధా తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం మండల నాయకులు గోవింద్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు లక్ష్మీదేవి, మేరీ, సుజాత, లీలావతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : అంగన్వాడి వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ ప్రతినిధులు నిరసన తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలో ని ఎనుములపల్లి గణేష్ సర్కిల్ తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అంగనవాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ ఆర్ ఎస్ రద్దు చేయాలని, మినీ అంగన్వాడీల జీవో ఇవ్వాలని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. నెట్ సిగ్నల్ లేకపోవడం సర్వర్ పని చేయకపోవడంతో అనేక సమస్యలను అంగన్వాడీలు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల ప్రతినిధులు లెక్కల సుజాత, పద్మావతి, మంజుల, షర్మిల, స్వాతి, రేణుక, వేదవతి, సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, రామ్మోహన్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని సిఐటియు పట్టణ కన్వీనర్ రాము ప్రభుత్వనికి డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మినీ అంగన్వాడి వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాడ్యుటి జీఓలో మార్పు చేయాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు గురువారం స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం ముందు ఆందోళన చేసి, బాలయ్య వ్యక్తి గత కార్యదర్శి వీరయ్యకు వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అంగనవాడి కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించక పోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్టర్ నాయకులు శిరీష, నాగమ్మ, పద్మ, రిహానా, రజిని, ఆయిషా, ఇందిర, సరిత, సావిత్రి, చంద్రకళ, శోభ, సునంద, కేథరిన్, సుమేర తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో అంగన్వాడీల మానవహారం

చిలమత్తూరులో అంగన్వాడీల నిరసన

పుట్టపర్తిలో నాయకుల నిరసన

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని సిద్దయ్యగుట్ట వద్ద గల ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్ సమీపంలో వ్యక్తిని బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. మృతుడు పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన పాల్యం ధనుంజయ (27)గా గుర్తించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ హేమంత్ కుమార్‌తో పాటు వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ధనుంజయ మెకానిక్ వృత్తి చేసుకుంటూ జీవనాన్ని కొనసాగించేవాడని వన్‌టౌన్ సిఐ తెలిపారు. సిమెంటు ఇటుక పెళ్లలతో తీవ్రంగా దాడి చేయడంతో ధనుంజయ మృతిచెందినట్లు చెప్పారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

రౌడీ షీటర్ అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని దేవళం వీధిలో నివసిస్తున్న సాయి కిషోర్ ను కిడ్నాప్ చేసి దాడి చేసిన కేసులో రౌడీ షీటర్ పవన్ కుమార్ ను అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం సాయి కిషోర్ అనే వ్యక్తిని చంపే ఉద్దేశముతో కిడ్నాప్ చేసి దాడి చేసి గాయపరచిన కేసులో రాజీ కాకపోతే చంపుతాము అని బెదిరించిన మరో కేసులో ప్రధాన నిందితుడు రౌడీ షీటర్ పవన్ కుమార్ ఆలియాస్ పట్ర పవన్‌ను బుధవారం రాత్రి అన్నమయ్య జిల్లా మదనపల్లిలో అరెస్ట్ చేసి కదిరి కోర్టులో హాజరు పరచామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసులో ఇతర ప్రదాన నిందితులు శివ ఆలియాస్ పట్ర శివ, సాయి కుమార్, కళ్యాన్ ఆలియాస్ చోరాలు పరారీలో ఉన్నారని నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని చెప్పారు. **తలుపుల :** మండల పరిధి

అటవీ శాఖ అధికారులపై దాడి అమానుషం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కర్నూలు జిల్లా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆయన అనుచరులు విధులు నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బందిపై దాడికి పాల్పడటం అమానుషమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కదిరి తాలూకా అధ్యక్షులు జి.ఫకద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాయసం హరిప్రసాద్ పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అటవీశాఖ సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గొడవలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

వినాయక చవితి ఉత్సవాలలో గ్రామాల్లో ఎటువంటి గొడవలు జరగకుండా శాంతియుతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం వినాయక ఉత్సవాల నిర్వహణపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో ముందస్తు సమాచారం తెలుసుకొని వినాయక ఉత్సవాల నిర్వహణపై సూచనలు సలహాలు అందజేయాలన్నారు. ఎక్కడైనా గ్రామాలలో గొడవలు జరిగే సూచనలు కనిపిస్తే అటువంటివారిని వెంటనే బైండోవర్ చేయాలన్నారు. పోలీసు ఉన్నతాధికారుల సూచనలను సిబ్బంది తప్పకుండా ప్రజలకు తెలియజేసి వినాయక ఉత్సవాలలో ఎటువంటి గొడవలు జరగకుండా చూడాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన మార్కెట్‌యార్డ్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి గోరంట్ల

మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ శైలజ, వైస్ చైర్మన్ తిరుపాల్, డైరెక్టర్లు గురువారం తమ బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులను తెలుగుదేశం పార్టీ నాయకులు సత్కరించారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు శ్రీనివాసులు, మంజునాథ్, రవి నాయక్, సుధాకర్, గోపాల్, రామాంజినమ్మ, కళావతి, అమ్మజాన్, రత్నమ్మ, ఆదినారాయణ, కన్వీనర్ బాలకృష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు

యుటిఎఫ్ రొళ్ల మండల అధ్యక్షులుగా శ్రీకాంత్

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండల యుటిఎఫ్ అధ్యక్షులుగా శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నాగరాజు, అధ్యక్షులుగా శ్రీకాంత్, సహాధ్యక్షులుగా ఉషారాణి చిన్నికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అనిల్ కుమార్, కోశాధికారిగా అనిల్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులుగా ముస్తాన్ వలి, నాగరూపకళ, శ్యాం ప్రసాద్, కార్యదర్శులుగా భాగ్యలక్ష్మి, నగేష్, కోమల జిల్లా కౌన్సిలర్లుగా మహేష్, జయరాం, పవన్, రవి కుమార్‌ను ఎన్నుకొన్నారు.

సీనియర్స్ మహిళా క్రికెట్
రాష్ట్ర ప్రాబబుల్స్‌కు కదిరి క్రీడాకారిణులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో జరుగుతున్న అండర్ 23, సీనియర్స్ టి20, వన్ డే రాష్ట్ర ప్రాబబుల్స్ క్రికెట్ పోటీలకు కదిరి క్రీడాకారిణులు అర్షియా, తెజేశ్వనిఎంపిక అయ్యారు.ఈ మేరకు కోచ్ నజీర్ మాట్లాడుతూ ఇటీవల అనంతపురంలో జరిగిన అంతర జిల్లాల క్రికెట్ పోటీలలో అర్షియా 4 మ్యాచ్‌లలో ఆడి అర్ధ సెంచరీతో సహా 160 పరుగులు చేయగా, తెజేశ్వని 4 మ్యాచ్ లలో 4 ముఖ్యమైన వికెట్లు సాధించి ప్రతిభ కనబరిచారన్నారు. దీంతో ఈ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కదిరి మండల క్రికెట్ సంఘం అధ్యక్షులు కందికుంట వెంకట ప్రసాద్, ఉపాధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ , సీనియర్ క్రీడాకారులు, సాధన పాఠశాల యాజమాన్యం అభినందించారు.

పింఛన్లను తొలగించడం సిగ్గుచేటు

హిందూపురం రూరల్ : అర్హులైన వికలాంగుల పింఛను తొలగించడం సిగ్గు చేటని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక విమర్శించారు. ఈ మేరకు గురువారం మండలపరిధిలోని బెవినహళ్లిలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోగా వికలాంగుల పింఛన్లు తొలగించడానికి కుట్ర పన్నడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, ఆనంద్ కుమార్, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, మల్లేష్, ఉడుగులపల్లి చౌడప్ప, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించండి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

తప్పుల్లేని ఓటర్ జాబితా తయారీకి అన్ని పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ కోరారు. గురువారం కలెక్టరేట్లో ఎన్నికల అధికారులతో పాటు జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితాలో అభ్యంతరాలు, సూచనలు తెలపాలని కోరారు. ఓటరు జాబితా తయారీ, పోలింగ్ శాతం పెంచేందుకు యువతను ఓటరుగా నమోదు చేయించడం వంటి వాటికి పార్టీల ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ కలెక్టర్ జాకీర్ హుస్సేన్ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన సగర ఉప్పర రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండల పరిధిలోని రంగేపల్లి గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి, సీనియర్ టిడిపి నాయకులు వెంకటరమణను రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ గా ప్రభుత్వం నియమించింది. గురువారం విజయవాడ లోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో బీసీ సంక్షేమ చేనేత శాఖామంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలసి పూల బొకేలతో ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువ నాయకులు మేకలపల్లి ఆదినారాయణ, కేతగాని చెరువు లోకేంద్ర, జనసేన నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

తలుపుల : మండల పరిధి లోని ఈదులకుంట్లపల్లి గ్రామానికి చెందిన నాగమ్మ సంరక్షణలో ఉన్న మూగ పిల్లవాడి పేరు పింఛను తొలగింపు జాబితాలో ఉండటంతో నాగమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. సంతానం లేని తాను పురిటి బిడ్డను తీసుకుని పెంచుకుంటున్నానని చెప్పింది. ఆ పిల్లవాడి తల్లిదండ్రులు మృతి చెందడంతో అన్నీ తానై పెంచుతున్నానని ఆ పిల్లవాడు మూగవాడని చెప్పింది. నెలసరి వచ్చే పింఛను ద్వారా పిల్లవాడి ఆలనాపాలన చూస్తున్నానని చెప్పింది. ఇప్పుడు పింఛను తొలగిస్తే తాను ఎలా పోషించాలని ప్రశ్నిస్తోంది.

అగళి : మండలంలో 98 మంది వికలాంగుల పేర్లు పింఛను తొలగింపు జాబితాలో ఉండటం వారికి నోటీసులు జారీ చేయడంతో బాధితులు లబోదిబో మంటున్నారు. ఈనేపథ్యంలో బాధితులు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చిన తమ గోడును వెల్లబోసుకున్నారు. అంగవైకల్యం ధ్రువీకరణ పత్రాలు సరిగా లేనందున నోటీసులు జారీ చేశామని అధికారులు చెప్పడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కసాపురం గ్రామానికి చెందిన వడ్డీ గేరమ్మ మాట్లాడుతూ తాను కాళ్లు చొచ్చులబడి నడవలేని పరిస్థితిలో ఉన్నానని అన్నారు. తనపేరు తొలగింపు జాబితాలో ఉందని వాపోయారు. పింఛను రద్దు చేస్తే తన పరిస్థితి ఏమిటని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ముందు కంటతడి పెట్టారు. అలాగే ఆలూడి గ్రామానికి చెందిన రఘు మాట్లాడుతూ తనకు 81 శాతం వికలత్వం ఉందని తన పేరు తొలగింపు జాబితాలో ఉందని వాపోయారు. తనకు పింఛను నిలిపివేస్తే ఆత్మహత్య శరణ్యం అన్నారు. స్పందించిన ఎంపిడిఒ మాట్లాడుతూ అనర్హులుగా నోటీసులు తీసుకొన్నవారు కొత్తగా అర్జీలు ఇవ్వాలని మరల వాటిని ప్రభుత్వానికి పంపుతామన్నారు. తిరిగి సదరం క్యాంపునకు వెళ్లి 40 శాతం కంటే ఎక్కువగా అంగవైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకువస్తే పింఛను ఇస్తామని తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని కందకూర్లపల్లిలో అనంత శక్తి సొసైటీ ఆధ్వర్యంలో సి ఈ ఓ లావణ్య అధ్యక్షురాలు సుశీలమ్మ అధ్యక్షతన మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు.ప్రస్తుత సమాజం లో మహిళలపై జరుగుతున్న వివక్షత, హింసపై నాటిక రూపంలో ప్రదర్శించారు. బాల్యవివాహాలు, సమాజంలో సమానత్వం, నిర్ణయాధికారం వంటి అంశాలపై మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిఇఒ లావణ్య, సభ్యులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

ఓబుళదేవరచెరువు : మండలంలోని గౌనిపల్లిలో గల బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ఎబిసిడబ్ల్యూఒ బాలాజీ గురువారం తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రత, మరుగుదొడ్ల వాడకం, విద్యార్థులు అందించే భోజన వసతిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగిద్దాం

ఆశ్రమంలో అందుబాటులో ఉంచిన మట్టి వినాయక విగ్రహాలు

షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప
ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు
ఆశ్రమంలో అందుబాటులో మట్టి వినాయక విగ్రహాలు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పర్యావరణ హితం కోసం మట్టి వినాయకుడి ప్రతిమలు పూజించాలని షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్పర్సన్ శిల్ప అనుపాటి పిలుపునిచ్చారు. పర్యావరణం క్షీణిస్తున్న తరుణంలో పర్యావరణ పరిరక్షణ కోసం శిల్ప నడుంబిగించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఆమె పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. చెప్పడం కన్నా తాను చేస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు సంచులను వాడటం, వాటర్ బాటిల్లు వాడకుండా రాగి బాటిళ్లను వాడటం లాంటి వాటిపై అవగాహన కల్పించారు.తనతో పాటు తన చుట్టూ ఉన్నవారు కూడా పాటించే విధంగా ఆమె చైతన్యం తెచ్చారు. ముఖ్యంగా వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వాడకుండా మట్టి విగ్రహాలను వాడాలని ట్రస్ట్ ఆధ్వర్యంలో చాలా కాలంగా ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు.వీటిపై ప్రతి ఏడాది విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది మట్టి విగ్రహాలను తెప్పిస్తూ వాటి ప్రాముఖ్యాన్ని ప్రజలకు వివరిస్తున్నారు.గత పది సంవత్సరాలనుండి మట్టి వినాయక విగ్రహాల అవశ్యతను వివరిస్తూ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ లు,సమావేశాలు నిర్వహిస్తూ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు. అదేవిధంగా మట్టి వినాయక విగ్రహాలను ఆశ్రమంలో అందరికీ అందుబాటులో ఉంచుతున్నారు.

నియోజకవర్గంలోని చెరువులకు నీరందించండి

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ హంద్రీనీవా కాలువ ద్వారా నీరు అందించాలని ఎంపీ బికె. పార్థసారథి, ఎమ్మెల్యే రాజు ఆదేశించారు. అనంతపురంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ లో హంద్రీ-నీవా అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఇరిగేషన్ అధికారులు హాజరై మడకశిర నియోజకవర్గంలోని నీటి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హంద్రీనీవా కాలువల ద్వారా చిట్ట చివరన ఉన్న మడకశిర నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర నియోజకవర్గంలోని కే.గుండుమల గ్రామానికి వచ్చినప్పుడు హంద్రీనీవా బైపాస్ కాలువను నిర్మాణం చేపడతామని, రొళ్ల మండలం రత్నగిరి వద్ద, గుడిబండ మండలం రాళ్లపల్లి వద్ద రిజర్వాయర్లను నిర్మిస్తామని మడకశిర నుంచి రొళ్ల, అగళి మరియు గుడిబండ, అమరాపురం మండలాలకు నిర్మించిన కాలువలను వెడల్పు చేసి ప్రతి చెరువుకి నీరు చేరేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇప్పటికే సంబంధిత అధికారులతో అంచనాలను సిద్ధం చేసి ముఖ్యమంత్రి కార్యాలయంలో సమర్పించామన్నారు. ఈ సమావేశంలో హంద్రీనీవా ఎస్ఇ స్వరూప్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిఇలు, ఏఇలు, కుంచిటిగ, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, ఐదు మండలాల సింగిల్ విండో అధ్యక్షులు, జడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ఎస్పీ రత్న

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వినాయక మంటపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని ఎస్పీ రత్న తెలిపారు. ఈనెల 27 న వినాయక చవితి పండగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పాటించవలసిన నియమ నిబంధనలు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు గురించి ఎస్పీ వివరించారు. వినాయక పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న వినాయక విగ్రహం ఏర్పాటుకు సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్ఒ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వినాయక ఉత్సవాల మండపాల ఏర్పాటుకు ఆన్లైన్ విధానంలో అనుమతులు పొందాలన్నారు. దరఖాస్తు చేయగానే సంబంధిత పోలీస్ అధికారి ఆ మండపం ప్రాంతాన్ని పరిశీలించి క్యూఆర్ కోడ్ తో కూడిన ఎన్‌ఒసి జారీ చేస్తారని ఎస్పీ తెలిపారు. వినాయక విగ్రహ ప్రతిష్టాపన, పందిళ్లు,మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలపాలని, గుర్తింపు కార్డు నకలు కాపీలు పోలీస్ వారికి చూపించి అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ప్రయివేటు లేదా పంచాయతీ మున్సిపాలిటీ కి సంబంధించిన స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే వారు ముందుగా సదరు ప్రవేటు స్థలమైతే స్థల యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ లేదా మున్సిపాలిటీ వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వారితోపాటు చుట్టుపక్కల నివసించే వారి సమ్మతి కుడా పొందాలన్నారు.అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతి తీసుకోవాలని, వారు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా వినాయక చవితి పందిళ్లు,మండపాల వద్ద ఇసుక, నీటినిఏర్పాటు చేసుకుని తగిన ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. మండపాలలో దీపారాధనల వలన అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ వైర్లను, కాంతివంతమైన లైట్ల వినియోగంలో ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా విద్యుత్ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిష్ఠించనున్న వినాయక విగ్రహాల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల సంఖ్య, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జన మార్గం, నిమజ్జన ప్రదేశము , విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఒకు తెలియజేయాలన్నారు. పెద్ద పెద్ద సౌండ్లతో లౌడ్ స్పీకర్లు పెట్టకూడదన్నారు. భద్రత కొరకు రాత్రి సమయాలలో మండపాల వద్ద ఉత్సవ కమిటీ వారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపు సమయాలలో ఎక్కడ కులాలు, మతాలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే విధంగా నినాదాలు చేయరాదన్నారు. పందిళ్ళ వద్ద మరియు ఊరేగింపు సమయాలలో,మద్యం లేదా మత్తు పదార్థాలను వాడిన వారు ఆ ప్రాంతంలో,లేకుండా ఉండే విధంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఉత్సవ కమిటీ కార్యనిర్వాహకులే పూర్తి బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు.